

అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలి

వేమనపల్లి, ఏప్రిల్ 12: షెడ్యూల్డు కులాలు పారిశ్రామికంగా అభివృద్ధి చెందడానికి అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని ఓయూ జేఏసీ నాయకుడు దుర్గం మల్లేష్ శుక్రవారం హైద్రాబాద్‌లో డీఐసీసీఐ రాష్ట్ర అధ్యక్షురాలు అరుణకు వినతిపత్రం అందించారు. మల్లేష్ మాట్లాడుతూ షెడ్యూల్డు కులాలకు చెందిన యువతీ, యువకులను పారిశ్రామిక రంగంలో అభివృద్ధి చెందడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతీ గ్రామంలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని విన్నవించారు. ఇందుకు రాష్ట్ర అధ్యక్షురాలు సానుకూలంగా స్పందించినట్లు మల్లేష్ తెలిపాడు.

జోరుగా నకిలీ దందా

- పొగాకు ఉత్పత్తుల్లో కల్తీ
- సిగరెట్లు, అంబర్ ప్యాకెట్లలో వ్యాపారుల చేతివాటం
- డబ్బు, ఆరోగ్యం గుల్ల చేసుకుంటున్న వ్యసనపరులు
- జిల్లా కేంద్రంలో పదుల సంఖ్యలో అడ్డాలు
- నిత్యం రూ.కోట్లలో సాగుతున్న అక్రమ దందా



మంచిర్యాల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నకిలీ దందా జోరుగా సాగుతోంది. నిత్యావసర సరుకులతోపాటు పొగాకు ఉత్పత్తులను భారీగా కల్తీ చేస్తున్న అక్రమార్కులు కోట్లకు పడగలెత్తుతున్నారు. జీరో వ్యాపారం కారణంగా ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి పడుతుండగా, పొగాకు ఉత్పత్తులకు అలవాటైన ప్రజల ఆరోగ్యం, జేబులు గుల్ల అవుతున్నాయి. జిల్లాలో నిత్యం కోట్ల రూపాయల అక్రమ దందా జరుగుతుండగా అధికారులు, అనధికారులకు పెద్ద మొత్తంలో వాటాలు అందుతున్నట్లు తెలుస్తోంది.

చట్టబద్ధత చేసినప్పటి నుంచి

ముఖ్యంగా పొగాకు ఉత్పత్తులైన అంబార్, గుట్కాల విక్రయాలకు గతంలో నిషేధం ఉండేది. దీంతో ఒరిజినల్ ఉత్పత్తులను బహిరంగంగా విక్రయించేందుకే అష్టకష్టాలు పడాల్సివచ్చేది. మూడేళ్లుగా ఆయా ఉత్పత్తులపై ప్రభుత్వం నిషేధం ఎత్తివేయడంతో అక్రమార్కులకు కలిసి వచ్చినట్లయింది. అక్రమార్కులు ఆయా ఉత్పత్తులను కల్తీ చేస్తూ జీరో దందాకు తెరలేపారు. జిల్లా వ్యాప్తంగా ఈ అక్రమ వ్యాపారం ప్రస్తుతం నలుమూలలా విస్తరించింది. అసలు ఉత్పత్తులతో పోలిస్తే, ఏ మాత్రం తేడా ఉండని నకిలీ సరుకులను రిటైల్ షాపులకు తరలిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. అక్రమ దందా కారణంగా ప్రభుత్వ ఖజానాకు భారీ గండి పడుతుండగా, వినియోగదారులు నిలువునా మోసపోతున్నారు.

నకిలీ ఉత్పత్తులతో వ్యాపారం...

సిగరెట్, అంబార్, తదితర బ్రాండ్లను పోలిన నకిలీ ఉత్పత్తులను ఇతర ప్రాంతాల నుంచి రహస్యంగా దిగుమతి చేసుకుంటున్న వ్యాపారులు, వాటిని గుట్టుచప్పుడు కాకుండా మార్కెటింగ్ చేస్తున్నారు. జిల్లాలోని ప్రధాన పట్టణాలు, జనసంచారం కలిగిన ప్రాంతాలను ఎంచుకుంటున్న వ్యాపారులు అసలు వాటితో కలిపి నకిలీ సరుకులను చేరవేస్తున్నట్లు తెలుస్తోంది. ఆయా ప్రాంతాల్లో బాగా నడిచే పాన్ షాపులు, చాయ్ కొట్లు, కిరాణా షాపులను ఎంచుకుంటూ వాటి ద్వారా నకిలీ ఉత్పత్తుల విక్రయాలు జరుపుతున్నారు. మార్కెట్లో విరివిగా అమ్ముడయ్యే కింగ్స్, లైట్స్, గోల్డ్‌ఫ్లాక్ సిగరెట్లతోపాటు అంబార్, అనార్, తదితర రకాలలో అధికంగా నకిలీ సరుకులు అంటగడుతున్నట్లు సమాచారం. ప్యాకెట్లపై లోగో, క్యాప్షన్, లోపలి సరుకు అచ్చం ఒరిజినల్ లాగే కనపడుతుండగా ప్యాకెట్లు, వాటిపై తయారీ తేదీలు ముద్రించడంలో తేడాలుంటున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా నకిలీ సిగరెట్లలో వాడే పొగాకు పూర్తిగా నాసిరకం ఉపయోగిస్తున్నట్లు సమాచారం. దీంతో వ్యసనపరులు అనారోగ్యం పాలవుతుండగా, జేబులు గుల్ల చేసుకుంటున్నారు.

నకిలీ ఉత్పత్తులపై ఎక్కువ కమీషన్..

నకిలీ ఉత్పత్తులను వినియోగదారులకు అంటగట్టే పాన్ షాపులు, కిరాణ దుకాణాల నిర్వాహకులకు అధిక మొత్తంలో కమీషన్లు అందజేస్తున్నట్లు తెలుస్తోంది. ఒరిజినల్ సిగరెట్ పెట్టెపై విక్రేతలకు గరిష్టంగా రూ.1.50 పైసలు లాభం ఉండగా, నకిలీ ఉత్పత్తులపై ఐదారు రూపాయలు లాభాలు ఉంటాయని సమాచారం. ఒక్కో పాన్‌షాపు, కిరాణా దుకాణం, టీ కొట్లలో తక్కువలో తక్కువ నిత్యం సగటున రూ. 20వేల వరకు పొగాకు ఉత్పత్తుల విక్రయాలు సాగిస్తుంటారని అంచనా. అలా అధిక లాభాలకు అలవాటుపడ్డ కొందరు పాన్‌షాపులు, కిరాణా దుకాణాల నిర్వాహకులు అసలు స్థానంలో నకిలీలు అంటగడుతున్నట్లు తెలుస్తోంది. కేవలం పొగాకు ఉత్పత్తులు విక్రయించేందుకే ప్రధాన పట్టణాల్లో ప్రత్యేక సెంటర్లు ఏర్పాటు చేస్తున్నారంటే అతశయోక్తికాదు. టీ కొట్ల పేరుతో అడ్డాలు నెలకొల్పుతూ లోపల ప్రత్యేక గదులు, పొగ తాగేందుకు ఏర్పాటు చేస్తున్నారు. ఆయా కేంద్రాల్లో నిత్యం వందలాది మంది కేవలం సిగరెట్లు తాగేందుకు వెళ్తుంటారనడంలో ఎలాంటి సందేహం లేదు.

మంచిర్యాల కేంద్రంగా....

మంచిర్యాల పట్టణ కేంద్రంగా నకిలీ పొగాకు ఉత్పత్తుల వ్యాపారం జోరుగా సాగుతోంది. జిల్లా కేంద్రంలోనే నకిలీ ఉత్పత్తులు లభ్యమయ్యే దాదాపు పది వరకు అడ్డాలున్నట్లు సమాచారం. జిల్లా కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే మార్కెట్ రోడ్‌లో గల ఓ బడా ట్రేడర్స్‌లో ఈ అక్రమ దందా జోరుగా సాగుతుండగా, స్టేషన్ రోడ్డులోనూ మరో ట్రేడర్స్‌లో జీరో వ్యాపారం యథేచ్ఛగా నడుస్తోంది. అలాగే ఎలాంటి బోర్డులు పెట్టకుండా నేరుగా పాన్‌షాప్‌లే లక్ష్యంగా పొగాకు ఉత్పత్తులు సరఫరా చేస్తున్న ఓ వ్యక్తి నకిలీ సరుకును పెద్ద మొత్తంలో అంటగడుతున్నట్లు సమాచారం. ఒరిజినల్ పేరిట బహిరంగంగా నకిలీ సరుకులు విక్రయిస్తున్నా అడిగేవారు కరువయ్యారు. జీరో బిజినెస్ చేసే వారు తమ సంపాదనలో ఎవరి వాటాలు వారికి ముట్టజెప్పుతున్నట్లు తెలుస్తోంది. ఒక్కో పాన్ షాపు నుంచి నెలకు రూ.10వేలు మామూళ్ల పేరిట వసూలు చేస్తున్నట్లు బహిరంగంగా ప్రచారం జరుగుతోంది. అధికారులు చొరవ చూపి అక్రమ వ్యాపారాన్ని అరికట్టాలని కోరుతున్నారు.

ప్రైవేట్ ఆసుపత్రులు నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సుబ్బారాయుడు

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 12: జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రులు నిబంధనలు పాటించాలని డీఎంహెచ్‌వో సుబ్బారాయుడు సూచించారు. శుక్రవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో ప్రైవేటు ఆసుపత్రుల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆసుపత్రి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, వైద్యుల వివరాలు, అర్హతలు, వైద్య సేవలను డిస్‌ప్లే చేయాలని సూచించారు. ప్రస్తుతం పని చేస్తున్న వైద్యుల వివరాలు నమోదు చేయించుకోవాలని, లేని వారిని తొలగించాలని, కన్సల్‌టెంట్ డాక్టర్లు ఏ టైంకు వస్తారు, ఫీజు వివరాలను డిస్‌ప్లే చేయాలన్నారు. అంబులెన్స్ ద్వారా వచ్చిన కేసుల వివరాలు ప్రత్యేక రిజిష్టర్‌లో నమోదు చేయాలని, ఆసుపత్రి నుంచి పంపే కేసులను, అంబులెన్స్‌కు సంబంధించిన వివరాలను నమోదు చేయాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే వారికి తగిన సౌకర్యాలు కల్పించాలన్నారు. నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకొంటామన్నారు. సమావేశంలో డీఈఎంఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ కళాశాలపై చర్య తీసుకోవాలి



మాట్లాడుతున్న విద్యార్థి సంఘం నాయకులు

బెల్లంపల్లి, ఏప్రిల్ 12 :బెల్లంపల్లిలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ఎస్‌టీ లూయిస్ ఐటీఐ కళాశాలపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ విద్యార్థి ఉద్యమవేదిక రాష్ట్ర కార్యదర్శి చిప్పకుర్తి శ్రీనివాస్, జాతీయ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేరాల వంశీలు పేర్కొన్నారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎస్‌టీ లూయిస్ ఐటీఐ కళాశాలలో క్లాస్ రూంలు కూడా సరిగ్గా లేవన్నారు. కళాశాలలో ఫైర్ సేఫ్టీ లేదని, ఆవరణ చెత్తాచెదారంతో ఉందన్నారు. అధ్యాపకులు లేరని, విద్యార్థులకు మాయమాటలు చెబుతూ అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. హరీష్, నరేష్, రాకేష్, ప్రసాద్, తేజ పాల్గొన్నారు.

మహిళా మోర్చా అధ్యక్షురాలిగా శ్రీదేవి

ఏసీసీ, ఏప్రిల్ 12: మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలిగా జిల్లా కేంద్రానికి చెందిన జోగుళ శ్రీదేవిని రెండోసారి నియమించారు. శుక్రవారం జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ పార్టీ కార్యాలయంలో శ్రీదేవికి నియామకపత్రం అందించారు. తనపై నమ్మకంతో మరోసారి అవకాశం ఇచ్చినందుకు శ్రీదేవి కృతజ్ఞతలు తెలిపారు.

ప్లేస్‌మెంట్ డ్రైవ్



ఏసీసీ, ఏప్రిల్ 12: మంచిర్యాల పట్టణంలోని మిమ్స్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం సైయంట్ కంపెనీ ద్వారా ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. కంపెనీ రిక్రూట్‌మెంట్ డైరెక్టర్ సుశాంత్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ డ్రైవ్‌కు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి డిగ్రీ పూర్తి చేసిన 50 మంది అభ్యర్థులు హాజరుకాగా 15 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఎంపికైన వారిని కళాశాల ప్రిన్సిపాల్ ఉపేందర్‌రెడ్డి, కరస్పాండెంట్ శ్రీనివాసరాజు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్‌రావులు అభినందించారు. డైరెక్టర్ విజయ్‌కుమార్, ప్లేస్‌మెంట్ కో ఆర్డినేటర్ శ్వేత, రోహిత్‌కుమార్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

హన్మాన్ దీక్షల స్వీకరణ



దీక్షలు స్వీకరిస్తున్న భక్తులు

దండేపల్లి, ఏప్రిల్ 12: గూడెం ఆంజనేయస్వామి మందిరంలో శుక్రవారం హనుమాన్ భక్తులు దీక్షలు స్వీకరించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సుమారు 760 మందికి పైగా భక్తులు దీక్షలు చేపట్టినట్లు ఆలయ ఈవో నంకటాల శ్రీనివాస్ తెలిపారు. ఈనెల 23న హనుమాన్ జయంతి పురస్కరించుకొని దీక్షలు స్వీకరించారు.

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరేద్దాం



మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

బెల్లంపల్లి, ఏప్రిల్ 12: పార్లమెంట్ ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు కష్టపడి కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. శుక్రవారం బెల్లంపల్లిలోని ఆర్‌పీ గార్డెన్‌లో నిర్వహించిన నియోజకవర్గస్థాయి కాంగ్రెస్ నాయకుల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతులకు, ప్రజలకు చేసిందేమి లేదని పేర్కొన్నారు. గత ఎన్నికల సమయంలో బీజేపీ నిరుద్యోగులకు ఉద్యోగాలకు ఇస్తామని హామీ ఇచ్చి నేటి వరకు కల్పించలేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఐదు గ్యారంటీలను అమలు చేశామన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పారని, అదే విధంగా పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని పేర్కొన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీని భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత బెల్లంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే గడ్డం వినోద్ పూర్తిస్థాయిలో కృషి చేస్తారన్నారు. బెల్లంపల్లిలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లామని సానుకూల స్పందన లభించిందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే గడ్డం వినోద్ మాట్లాడుతూ బెల్లంపల్లి ప్రజలకు గోదావరి నీటిని అందిస్తామని, రహదారులు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని, నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీ మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో తనను గెలిపించిన తర్వాత బెల్లంపల్లిలో ఇంజనీరింగ్ కళాశాలతోపాటు సూపర్‌ఫాస్ట్ రైళ్లను హాల్టింగ్ అయ్యే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేలు వివేక్, మక్కాన్‌సింగ్, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, ఐఎన్‌టీయూసీ నాయకులు వెంకట్రావు, జనక్‌ప్రసాద్, మున్సిపల్ చైర్‌పర్సన్ శ్వేత, నాయకులు నాతరి స్వామి, బండి ప్రభాకర్, మల్లయ్య పాల్గొన్నారు.

నాయకుల సొంత పనులకు కార్మికులు



కారు తుడుస్తున్న పారిశుధ్య కార్మికుడు

మంచిర్యాల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికులు పలువురు ప్రజాప్రతినిధుల ఇళ్లల్లో పనులు చేస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని సంజీవయ్య కాలనీలో ఓ కౌన్సిలర్ తన కారును శుక్రవారం మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుడితో శుభ్రం చేయిస్తుండగా స్థానికులు తీసిన ఫొటోలు, వీడియోలు వాట్సప్ గ్రూపుల్లో వైరల్‌గా మారాయి. మున్సిపాలిటీ పరిధిలో పలు కాలనీలు దుమ్ము, ధూళితో కొట్టుమిట్టాడుతుండగా, ఇలా పారిశుధ్య కార్మికులను సొంత అవసరాలకు వినియోగిస్తుండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీ శ్రీనివాస్

ఏసీసీ, ఏప్రిల్ 12: యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా ఉండాలని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం కమిషనరేట్ హెడ్‌క్వార్టర్‌లో రాష్ట్ర యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో గంజాయి, కల్తీ కల్లు సేవించడం వల్ల జరిగే అనర్థాలపై ప్రజలను చైతన్య పరుస్తూ రూపొందించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. సీపీ మాట్లాడుతూ రాష్ట్రంలో గంజాయి, కల్తీ కల్లు వినియోగం ద్వారా వ్యక్తులకు, సమాజానికి జరిగే నష్టాన్ని తెలిపే విధంగా వాల్ పోస్టర్‌లను రూపొందించామన్నారు. గంజాయికి బానిసలుగా మారిన యువత భవిష్యత్‌ను నాశనం చేసుకుంటుందని, యువకుల జీవితాలు విచ్ఛిన్నం కావడంతోపాటు తల్లిదండ్రులు మానసిక క్షోభకు గురవుతున్నారన్నారు. గంజాయి, మత్తు పదార్థాలు ఎవరైనా విక్రయిస్తే వారి సమాచారాన్ని తెలియజేసే వారి వివరాలు గోప్యంగా ఉంటాయని తెలిపారు. గంజాయి రహిత కమిషనరేట్ కోసం అధికారులు, సిబ్బంది కృషి చేయాలన్నారు. అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేందర్‌రావు, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ బుద్దె స్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

ఏసీసీ, ఏప్రిల్ 12 : మంచిర్యాల పట్టణంలోని ఏసీసీ, రాంనగర్, రాజీవ్‌నగర్ సబ్‌స్టేషన్‌లలో మరమ్మతు చేపడుతున్నందున శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏడీఈ స్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

కోటపల్లి: కిష్టంపేట నుంచి కోటపల్లి వెళ్లే 33కేవీ విద్యుత్ లైన్ మరమ్మతు కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అల్గామ, దేవులవాడ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని అన్ని గ్రామాల్లో అంతరాయం ఉంటుందన్నారు.

తాండూర్: తాండూర్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు కారణంగా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. బోయపల్లి, చౌటపల్లి, ఐబీ, మాదారం, రేపల్లెవాడ, అబ్బాపూర్, బెజ్జాల గ్రామాల్లో విద్యుత్ ఉండదన్నారు.

కాసిపేట: మండలంలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ స్వర్ణలత ఒక ప్రకటనలో తెలిపారు. కొండాపూర్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు కారణంగా అంతరాయం ఉంటుందని తెలిపారు.

మందమర్రిరూరల్: సారంగపల్లి, చిర్రకుంట, శంకర్‌పల్లి, ఆదిల్‌పేట, పొన్నారం, వెంకటాపూర్ గ్రామాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ జయకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రిటైర్‌మెంట్ వయస్సుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి

ఏసీసీ, ఏప్రిల్ 12 : ఉద్యోగుల రిటైర్‌మెంట్ వయస్సుపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రాల రాజవేణు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కొన్ని పత్రికలు, టీవీ చానళ్లలో ఉద్యోగుల రిటైర్‌మెంట్ వయస్సును 61 సంవత్సరాలు లేదా 33 సంవత్సరాల సర్వీసు పూర్తయితే ఉద్యోగులను రిటైర్‌మెంట్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు వస్తున్న వార్తలతో ఉద్యోగులు అయోమయానికి గురవుతున్నారన్నారు. ఈ విషయంపై రాష్ట్ర కమిటీ సాధారణ పరిపాలన శాఖ, ఆర్థిక శాఖ అధికారులను సంప్రదించగా ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున విధానపరమైన నిర్ణయాలు తీసుకునే అవకాశం మంత్రి వర్గానికి, అధికారులకు లేదని చెబుతున్నారన్నారు. వెంటనే దీనిపై ప్రభుత్వం వెంటనే స్పష్టత నివ్వాలని కోరారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

భీమారం, ఏప్రిల్ 12: మండల కేంద్రంలో ఉస్కమల్ల చిన్న పోశం స్మారకార్థం నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను పోశం కుమారులు పున్నచంద్, శ్రీనివాస్, శివలు శుక్రవారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు టోర్నమెంట్ నిర్వహిస్తున్నామన్నారు. తిరుపతి, రవి, గ్రామస్తులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

వేసవి దుక్కులకు వేలాయే

- సస్యరక్షణలో మొదటి ప్రాధాన్యం
- ఎండల్లో లోతు దుక్కులతో అనేక ప్రయోజనాలు



నెన్నెల, ఏప్రిల్ 12: వేసవి దుక్కులతో రైతులకు పలు ప్రయోజనాలు కలుగుతాయి. లోతు దుక్కితో పంటలను ఆశించే వివిధ కీటకాల గుడ్ల సముదాయాలు, కోశస్థ దశలు మట్టి పొరల నుంచి బయటపడి ఎండ వేడికి నశిస్తాయి. తర్వాత పంటపై పురుగుల ఉధృతి తగ్గుతుంది. ఎండల్లో దున్నడం వల్ల తొలకరికే నీరు లోనికి ఇంకి భూమి కోతకు గురి కాకుండా ఉంటుంది. లోతు దుక్కుల వల్ల భూమి పై పొరలు కిందకి, కింది పొరలు పైకి తిరగబడి నేల సారవంతమవుతుంది. దీంతో నేలలో తేమ శాతం పెరిగి భూసార అభివృద్ధి, పురుగులు, తెగుళ్ళ యాజమాన్యం, కలుపుమొక్కల నివారణ తదితర ప్రయోజనాలు కలుగుతాయని నిపుణులు అంటున్నారు. ఇదే అదనుగా లోతు దుక్కులు దున్నుకోవాలని సూచిస్తున్నారు.

భూభౌతిక లక్షణాల పెంపు

లోతుగా దుక్కి చేయడం వల్ల లోపలి మట్టిపొరలు వదులై మొత్తం కలగలిసేలా చేయడమనేది వేసవి దుక్కుల ప్రధాన ఉద్దేశ్యం. సస్యరక్షణ చర్యల్లో వేసవి దుక్కులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలి. రుతుపవనాలు వచ్చే ముందు వేసవిలో నాగళ్లతో వాలుకు అడ్డంగా పొలాన్ని దున్నుకో వడంతో బోలెడు లాభాలున్నాయి. చాలా మంది రైతులు వానలు పడే వరకు పొలాలను ఖాళీగా వదిలేస్తూ ఉంటారు. ఇలా చేయడం వల్ల పంటకు నేలను తయారు చేసుకోవడానికి సమయం పట్టడమే కాకుండా పొలాల్లో కలుపు పెరిగిపోయి నేల సారాన్ని తగ్గిస్తుం ది. దీంతో తర్వాత పంటకు పోషక వినిమయ సామర్థ్యం పెరుగుతుంది. పత్తి లాంటి పైర్ల అవశేషాలను అలానే వదిలేయడం వల్ల గులాబీ పురుగు తన జీవిత చక్రాలను కొనసాగించడానికి అవకాశం కల్పించినట్లవుతుంది. వేసవిలో పడే అకాల వర్షాలతో పాటు, తొలకరి జల్లులు పొలాల్లో చేరాలంటే వేసవి దుక్కులు తప్పనిసరిగా చేయాలి. వేసవి దుక్కుల కంటే ముందు గొర్రెలు, పశువులు మందలు కూర్చో బెడితే వాటి మలమూత్రాలు భూమిలోకి చేరి సేంద్రియ ఎరువుగా ఉపయోగపడతాయి. దీంతో భూసారం వృద్ధి చెంది భూభౌతిక లక్షణాలు పెంపొందుతాయి.

ప్రయోజనాలు

పంటకోత అనంతరం బాగా గట్టిపడిన మట్టి పైపొరలను వదులు చేయడం వల్ల నేల గుల్లబారి పంట మొక్కల వేరు వ్యవస్థ లోపలికి ప్రవేశించి తేమను, పోషకాలను సమర్థంగా ఉపయోగించుకుంటాయి. లోతు దుక్కులతో గాలి లోపలికి చొరబడి సూక్ష్మజీవులు బాగా వృద్ధి చెందుతాయి. మిగిలిపోయిన పంట అవశేషాలను సేంద్రియ, పచ్చిరొట్ట ఎరువులతో కలియదున్నడం వల్ల మట్టిలో ఉన్న తేమతో కలిసి, కుళ్ళి నేలలో సారం పెరుగుతుంది. పంటలను ఆశించే వివిధ కీటకాల గుడ్ల సముదాయాలు, కోశస్థ దశలు మట్టి పొరల నుంచి బయటపడి వేసవి ఎండవేడికి నశిస్తాయి. తర్వాత పంటపై పురుగుల ఉధృతి తగ్గుతుంది.

మట్టిలోని అనేక రకాల హానికర బ్యాక్టీరియా, శిలీంధ్రాలు ఎండవేడికి నశించడం వల్ల మట్టి ద్వారా వ్యాపించే తెగుళ్లను చాలావరకు అరికట్టే వీలుంటుంది. లోతు దుక్కి వల్ల నేల లోపల ఉండిపోయిన బహువార్షిక మొక్కలైన తుంగగడ్డలు, గడ్డివేర్లు, వివిధ రకాల కలుపు మొక్కల విత్తనాలు మట్టి పై పొరకు చేరి వేడి తీవ్రతకు నశించి, కలుపు నివారణ సమర్థంగా జరుగుతుంది. వేసవి జల్లులను ఉపయో గించుకుని వాలుకు అడ్డంగా లోతుదుక్కి చేయడం వల్ల వర్షపునీరు, మట్టి కోతకు గురికాదు. నీరు భూమి లోపలికి ఇంకి ఎక్కువ కాలం నిల్వ ఉండి పంటకు ఉపయోగపడుతుంది. దీని వల్ల వర్షపు నీటి వినియోగ సామర్థ్యం పెరుగుతుంది. పంటల్లో మం దుల పిచికారి తగ్గి వాతావరణ సమతుల్యత దెబ్బతినకుండా ఉంటుంది.

లోతు దుక్కులకు ఇదే అదను : సుద్దాల ప్రేమ్‌కుమార్, మండల వ్యవసాయ అధికారి, నెన్నెల



సస్యరక్షణ చర్యల్లో వేసవి దుక్కులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలి. లోతు దుక్కులకు ఇదే అనువైన కాలం. ఎండల్లో చేలను దున్నుకుంటే బోలెడు ప్రయోజనాలు కలుగు తాయి. పంటపొలాల్లో ప్రత్యేక పరికరాలతో లోతుగా దున్నడం వల్ల వర్షపు నీరు లోనికి చేరి పంటకు ఎక్కువ కాలం ఉపయోగపడుతుంది. నేలలో కోశస్థ దశలో ఉన్న చీడపీడల గుడ్లు బయటకు వచ్చి చని పోతాయి. కలుపు మొక్కల గడ్డలు, విత్తనాలు బయట పడి తర్వాత పంటలో కలుపు బెడద తక్కువగా ఉంటుంది. ఆకులు, చెత్త భూమిలో చేరి సేంద్రియ ఎరువుగా ఉపయోగపడతాయి. దీంతో పెట్టుబడి కూడా తగ్గుతుంది.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చెన్నూరు, ఏప్రిల్ 12: సుందరసాల గ్రామానికి చెందిన కొండేటి సంజీవ్ (45) ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ కలహాల కారణంగా సంజీవ్ భార్య నెల రోజుల క్రితం పుట్టింటికి వెళ్లింది. భార్య రావడం లేదని మనస్థాపానికి గురైన సం జీవ్ ఈనెల 9న పురుగుల మందు తాగాడు. కుటుంబీకులు చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రికి, అనంతరం మంచిర్యాలకు తరలించారు. చికిత్స పొందుతూ సంజీవ్ గురువారం రాత్రి మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ మజీద్ తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం

జైపూర్, ఏప్రిల్ 12: మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద గ్రామ ప్రత్యేకాధికారి, ఎంపీడీవో సత్యనారాయణ శుక్రవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విద్యాసాగర్, కార్యదర్శి ఉదయ్‌కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కష్టపడ్డ వారిని పార్టీ పట్టించుకోవడం లేదు

కార్యకర్తల సమావేశంలో నిరసన

బెల్లంపల్లి, ఏప్రిల్ 12 : కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడిన వారిని పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కౌన్సిలర్ బండి ప్రభాకర్ మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకువెళ్లారు. శుక్రవారం ఆర్‌పీ గార్డెన్స్‌లో జరిగిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో పార్టీ కోసం అహర్నిశలు కష్టపడిన వారికి గౌరవం దక్కడం లేదని, ఒకరిద్దరు నాయకులు మాత్రమే అధ్యక్ష స్థానంలో ఉండి వ్యవహరిస్తున్నారని సభలో అసంతృప్తి వ్యక్తం చేశారు. కౌన్సిలర్ ఇలా మాట్లాడడంతో మంత్రి సమస్యను పరి ష్కరిస్తానని శాంతింపజేశారు.

ఘనంగా కుంకుమ పూజలు

కాసిపేట, ఏప్రిల్ 12: సీతారాముల కల్యాణంలో భాగంగా శుక్రవారం రేగులగూడెంలోని రామాలయంలో కుంకుమ పూజలు నిర్వహించారు. శ్రీరామనవమి ముందు రోజుల్లో కుంకుమ పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని ఆలయ అర్చకులు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. లలిత, సంజన, కృష్ణకుమార్, లచ్చన్న, శంకర్, యశ్వంతరావు, వాసుదేవ్, గణపతి పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

కన్నెపల్లి, ఏప్రిల్ 12: జజ్జరవెల్లి గ్రామంలో అభయ వీరాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టాపన పూజలను శుక్రవారం నిర్వహించారు. వేద పండితులు యాగం నిర్వహించారు. మహాగణపతి, స్థల శుద్ధి పూజలు నిర్వహించారు. అనంతరం ధ్వజ స్తంభ ప్రతిష్టాపన చేశారు. గురుస్వామి రాజలింగు, వేద పండితులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థిని గెలిపించండి



శ్రీరాంపూర్, ఏప్రిల్ 12: పెద్దపల్లి ఎంపీగా బీజేపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్ గెలిపించాలని జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ కోరారు. సోమవారం హిమ్మత్‌నగర్, కొత్తరోడ్, బస్టాండ్ ఏరియాల్లో ప్రచారం నిర్వహించారు. బీజేపీ అభ్యర్థిని ఎంపీగా గెలిపిస్తే ఆదాయపు పన్ను రద్దు, గ్రాట్యుటీ, పెన్షన్ సమస్యలు పరిష్కరిస్తారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కార్మికుల సమస్యల పరిష్కరిస్తానని మోసం చేసిందని, ప్రస్తు త కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సత్రం రమేష్, పబ్బతినేని కమలాకర్ రావు, మధు, కుర్ర చక్రి, పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు

హాజీపూర్, ఏప్రిల్ 12: మండలంలోని నర్సింగాపూర్, నంనూర్ గ్రామా లకు చెందిన పలువురు యువకులు యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు బొలిశెట్టి అశ్విన్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి రఘునాథ్ కండువాలు కప్పి ఆహ్వా నించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని రఘునాథ్ సూచించారు.

మందమర్రిటౌన్: పట్టణంలోని పలు వార్డులకు చెందిన మహిళలు జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బీజేపీలో చేరారు. వీరికి జిల్లా అధ్యక్షుడు రఘునాథ్, అధ్యక్షురాలు శ్రీదేవిలు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కుమారస్వామి, శ్రీను, నరేష్‌లు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

బెల్లంపల్లి, ఏప్రిల్ 12: పట్టణంలోని కాల్‌టెక్స్ ప్రాంతంలో నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని శుక్రవారం రాత్రి పట్టుకున్నట్లు టూటౌన్ ఎస్ఐ రమేష్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ బియ్యం నిల్వ ఉందని సమాచారం మేరకు మహమ్మద్ ఉబేద్ ఇంట్లో తనిఖీలు చేయగా 15 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడిందన్నారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకుని నిందితునిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సెల్‌ఫోన్ కోసం తండ్రిని హతమార్చిన తనయుడు


రాయమల్లు (ఫైల్)

రామకృష్ణాపూర్, ఏప్రిల్ 12: సెల్‌ఫోన్ కోసం తండ్రీకొడుకుల మధ్య వివాదం చెలరేగింది. దీంతో ఆగ్రహానికి గురైన కొడుకు తండ్రిపై దాడి చేసి హతమార్చాడు. రామకృష్ణాపూర్ చెందిన బావండ్లపల్లి రాయమల్లు(65) సింగరేణి రిటైర్డ్ కార్మికుడు. రాయమల్లుకు ఇద్దరు భార్యలు కాగా మొదటి భార్యకు ఇద్దరు కుమారులు, రెండో భార్య ఒక కుమారుడు రాకేష్ ఉన్నారు. మొదటి భార్య పిల్లలు మంచిర్యాలలో తల్లితో ఉంటున్నారు. రెండో భార్య కుమారుడు రాకేష్ మద్యానికి బానిసై తరచూ తం డ్రితో గొడవ పడుతున్నాడు. గురువారం రాత్రి రాకేష్ సెల్‌ఫోన్ కోసం తండ్రితో గొడవపడ్డాడు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న రాకేష్ తండ్రి జేబులో నుంచి సెల్‌ఫోన్ లాక్కున్నాడు. దీంతో తండ్రీ కొడుకుల మధ్య గొడవ జరగింది. రాకేష్ ఆగ్రహంతో పక్కనే ఉన్న రోకలిబండతో రాయమల్లు తలపై కొట్టడంతో కుప్పకూలిపోయాడు. గమనించిన స్థానికులు రాయమల్లును మంచిర్యాలకు తరలిస్తుం డగా మార్గమధ్యలో మృతి చెందాడు. రాకేష్‌ను అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదం

జన్నారం, ఏప్రిల్ 12: ఇందన్‌పల్లి చౌరస్తా సమీపంలో ప్రధాన రహదారిపై మురిమడుగు గ్రామం వైపు నుంచి వస్తున్న ద్విచక్ర వాహనం, ఇందన్‌పల్లి వైపు నుంచి వస్తున్న బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే జగిత్యాల ఆసుపత్రికి 108 అంబులెన్స్‌లో తరలించారు. సంఘటన స్థలాన్ని అదనపు ఎస్ఐ సర్కార్ పరిశీలించారు. క్షతగాత్రుల వివరాలు తెలియలేదని, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్లు వదిలేశారని యువకుల ఆరోపణ

జైపూర్, ఏప్రిల్ 12: ఇందారం శివారులో శుక్రవారం రాత్రి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారని స్థానిక యువకులు పోలీస్‌స్టేషన్‌లో సెకండ్ ఎస్ఐకి సమాచారం ఇచ్చారు. దీంతో ఆయన ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను అడ్డుకున్నారు. అనంతరం వారి వద్ద డబ్బులు తీసుకుని ట్రాక్టర్లను విడిచిపెట్టినట్లు యువకులు పేర్కొన్నారు. ఈ విషయంపై సెకండ్ ఎస్ఐని వివరణ కోరగా ట్రాక్టర్ యజమానులు ఇంటి అవసరాలకు ఇసుక తీసుకువెళ్తున్నారని చెప్పడంతో విడిచి పెట్టానని తెలిపారు.

అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించాలి


నస్పూర్‌లో మాట్లాడుతున్న మాల సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడు

ఏసీసీ, ఏప్రిల్ 12: అంబేద్కర్ జయంతిని ఈ నెల 14న ఘనంగా నిర్వహించాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ మారుతిప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. నాయకులు చిప్పకుర్తి శ్రీనివాస్, చేరాల వంశీలు మాట్లాడుతూ ఐబీ చౌరస్తా, ఏసీసీ అంబేద్కర్ విగ్రహాల వద్ద ఏర్పాట్లు చేయాలన్నారు. పార్టీ, మత పరమైన జెండాలు, బ్యానర్లు పెట్టకుండా చూడాలన్నారు.

నస్పూర్: అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని మాల సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడు గోసిక మనోజ్ తెలిపారు. సీసీసీ కార్నర్ వద్ద సంఘ ముఖ్య నేతల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతిని ఆదివారం ఉదయ 9 గంటలకు జెండా ఆవిష్కరణ, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం 5గంటలకు ర్యాలీ ఉంటుందన్నారు. బహుజనులు, సింగరేణి కార్మికులు, యువకులు, వ్యాపారులు, మహిళలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. నందయ్య, సుర్మిళ్ళ కిరణ్, ఓలెపు రవి, శరణ్, శ్రీనివాస్, పీక సతీష్, నవీన్ పాల్గొన్నారు.

జోరుగా సమ్మర్ సేల్స్

- రంజన్లు, కూలర్లు, టోపీల అమ్మకాలు
- కొత్త వెరైటీలు, డిజైన్‌లతో ఆకట్టుకుంటున్న వ్యాపారులు


అమ్మకానికి సిద్ధంగా ఉన్న ఫ్రీజులు


మంచిర్యాలలో విక్రయానికి సిద్ధంగా ఉన్న రంజన్లు, కుండలు


పెయింటింగ్ డిజైన్‌తో ఉన్న రాజస్థాన్ కుండలు

ఏసీసీ, ఏప్రిల్ 12: జిల్లాలో భానుడి ప్రతాపానికి ప్రజలు విలవిలలాడిపోతున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు విపరీతమైన వేడి, ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్నారు. పగటిపూట ప్రజలు ఇండ్లలో నుంచి బయటకు రావాలంటేనే జంకుతున్నారు. చిన్న పిల్లలు, వృద్ధులు వేడిని తట్టుకోలేక అల్లాడుతున్నారు. పేద, మధ్య తరగతి ప్రజలు వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు రక రకాల ప్రయత్నాలు చేస్తున్నారు.

వేసవి తాపం నుంచి సేద తీరేందుకు ప్రజలు పండ్ల రసాలు, మజ్జిగ, నిమ్మరసం వంటివి సేవించడంతోపాటు ఐస్‌క్రీంలు, పుచ్చకాయ ఎక్కువగా తీసుకుంటున్నారు. చల్లటి నీటి కోసం రంజన్‌లు, కుండలు, కూజాలు, మట్టితో చేసిన వాటర్ బాటిళ్లను కొనుగోలు చేస్తున్నారు. పలు ప్రాంతాల్లో రాజస్థాన్ కుండలు, ఆదిలాబాద్ రంజన్‌లు విక్రయిస్తున్నారు. 10 లీటర్ల నుంచి 20 లీటర్ల నీటి సామర్థ్యం గల కుండలను రూ. 250 నుంచి 400 వరకు విక్రయిస్తున్నారు. ఆదిలాబాద్ రంజన్‌లు 10 లీటర్ల నుంచి 20 లీటర్ల సామర్థ్యం గలవి రూ.250 నుంచి 300ల వరకు విక్రయిస్తున్నారు. 5 లీటర్ల కూజాలను రూ.100 నుంచి 150 వరకు విక్రయిస్తున్నారు. వీటితోపాటు కొత్తగా రంగులు వేసిన డిజైన్‌లతో కూడిన రాజస్థాన్ కుండలు, వాటర్ బాటిళ్లు అందుబాటులోకి తెచ్చారు. వేసవి సీజన్‌లో సగటున ఒక్కో వ్యాపారి దాదాపు వెయ్యి వరకు రంజన్‌లు, కుండలు విక్రయించే అవకాశం ఉందని తెలిపారు.

-జోరుగా సాగుతున్న కూలర్ల విక్రయాలు

కూలర్ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ప్లాస్టిక్, మెటల్‌బాడీతో కూడిన ఇంటి లోపల, ఇంటి బయట నుంచి వాడే రక రకాల వెరైటీలతో కూడిన కూలర్లను వ్యాపారులు అందుబాటులోకి తెచ్చారు. 30 లీటర్ల సామర్థ్యం నుంచి 100 లీటర్ల నీటి సామర్థ్యం గల కూలర్లు, చిన్న గది నుంచి పెద్ద హాలు వరకు చల్లదనం అందించే కూలర్లు అందుబాటులో ఉన్నాయి. ఇటీవల గడ్డికి బదులుగా సెల్యులోజ్ మెటీరియల్‌తో తయారు చేసి హనీకోంబ్ ప్యాడ్‌తో కూలర్లను రూపొందిస్తున్నారు. ఇవి గడ్డి కూలర్ల కంటే ఎక్కువ చల్లదనం ఇస్తాయని, యేటా గడ్డిని మార్చాల్సిన అవసరం ఉండదని వ్యాపారులు చెబుతున్నారు. జిల్లా కేంద్రంలో నాలుగు ఇనుప కూలర్ల తయారీ యూనిట్లు ఉన్నాయి. ఫంక్షన్ హాల్, హోటళ్లు, పెద్ద పెద్ద హాళ్లలో వినియోగించేందుకు జంబో కూలర్లు కూడా మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి.

అలాగే ఎండ వేడి నుంచి రక్షణ పొందేందుకు టోపీలను ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. రూ.100 నుంచి 300ల వరకు రకరకాల వెరైటీలు, డిజైన్‌లతో కూడిన టోపీలు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి.

కుండ పేదోళ్ల ఫ్రిజ్ - పీర్‌మహ్మద్, మంచిర్యాల



కూలీ పనులు చేసుకుని బతికే మాలాంటి వారికి కుండే ఫ్రిజ్. రూ.250కి కొనుగోలు చేశాను. యేటా వేసవి కాలంలో కొత్త కుండను కొనుగోలు చేసి జాగ్రత్తగా వాడుకుంటాం. కుండలో నీరు పోస్తే చల్లగా ఉంటుంది.

వ్యాపారం బాగుంది -మహేందర్, రంజన్ల వ్యాపారి



ఈ సంవత్సరం వ్యాపారం బాగుంది. మార్చిలోనే రాజస్థాన్ నుంచి కుండలు, ఆదిలాబాద్ నుంచి రంజన్‌లు తెప్పించి విక్రయాలు ప్రారంభించాం. సీజన్ ముగిసేలోగా వెయ్యి వరకు విక్రయిస్తాను. ఎండలు తీవ్రంగా ఉండడంతో కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు.

దండేపల్లి: ఉష్ణ ప్రతాపాన్ని తట్టుకునేందుకు ప్రజలు కూలర్లు, ఫ్రీజులు, ఏసీలను కొనుగోలు చేసేందుకు మొగుచూపుతున్నారు. చల్లని నీటితో దాహార్తిని తీర్చుకునేందుకు వివిధ కంపెనీల ఫ్రీజులను కొనుగోలు చేస్తున్నారు. ఎయిర్ కూలర్‌కు రూ. 3500 నుంచి 40 వేల వరకు మార్కెట్‌లో అందుబాటులో లభిస్తున్నాయి. ఏసీల కొనుగోలు పెరిగిపోయింది. వివిధ బ్రాండ్ల కంపెనీలకు చెందిన ఏసీలు రూ. 25వేల నుంచి లక్ష వరకు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి.

దోసకాయల విక్రయాలు : వేసవి తాపాన్ని తట్టుకునేందుకు దోసకాయలు ఎంతో ఉపయోగపడతాయి. శరీరానికి చల్లదనాన్ని ఇస్తుంది. దోసకాయలు కిలో రూ.40 నుంచి రూ. 80 వరకు విక్రయిస్తున్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు



రామకృష్ణాపూర్, ఏప్రిల్ 12: రామకృష్ణాపూర్ పట్టణంలో బీజేపీకి చెందిన ఎస్సీ బీసీ సెల్ అధ్యక్షులు వీరమల్ల రాజయ్య, బంగారు ప్రసాద్, రెల్లి కులస్తులు, పాడి రైతు సంఘం నాయకులు 300 మంది చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి ఆధ్వర్యంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి పార్టీ కండువాలు కప్పి సాధారణంగా ఆహ్వానించారు. పల్లె రాజు, రఘునాథ్ రెడ్డి, గోపతి రాజయ్య, ఓడ్నాల శ్రీనివాస్, సాగర్ రెడ్డి, పాల్గొన్నారు.

భీమారం: మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాజీ జెడ్పీటీసీ రాజ్‌కుమార్‌నాయక్, కొత్తపల్లి మాజీ సర్పంచు గోదారి తిరుపతి, మాజీ సర్పంచులు గద్దె రాంరెడ్డి, రమేష్, దుర్గం మల్లేష్, గొర్రె మేకల వృత్తిదారుల సంఘం కొమ్ము అశోక్‌యాదవ్‌లతో పాటు పలువురు ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

కార్మికులకు పెన్షన్ మంజూరు చేయించింది కాకానే

మందమర్రిటౌన్: సింగరేణి కార్మికులకు పింఛన్ మంజూరు చేయించింది దివంగత కాకా వెంకటస్వామి అని ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి తెలిపారు. శుక్రవారం యాపల్ ఏరియాలో రిటైర్డు కార్మికులు ఎమ్మెల్యే దృష్టికి సమస్యలను తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సింగరేణి సంస్థ అభివృద్ధికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ దేశ ప్రగతి, ప్రజల సంక్షేమమే ఏకైక లక్ష్యంగా రాహుల్‌గాంధీ ముందుకు వెళ్తున్నారన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలన్నారు. గుడ్ల రమేష్, బండి సదానందం, మంద తిరుమల్, రమేష్, విజయ్, సంతోష్, శంకర్, నర్సయ్యపాల్గొన్నారు.

జ్యోతిరావుపూలే విగ్రహావిష్కరణ


పూలే విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

బెల్లంపల్లి, ఏప్రిల్ 12 : బెల్లంపల్లి శాంతిఖని గని ఆవరణలో మహాత్మాజ్యోతిరావుపూలే జయంతి సందర్భంగా శుక్రవారం బీసీ ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో పూలే విగ్రహాన్ని ఆవిష్కరించారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు. అసోసియేషన్ సలహాదారుడు చిలుక శ్రీనివాస్, మధుకుమార్, విజయ్‌ప్రసాద్, రాజు, వెంకటేష్, రమేష్, నాగవర్ధన్, రమేష్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాల అందజేత

బెల్లంపల్లి, ఏప్రిల్ 12 : రాంజీగోండ్ విద్యార్థి నిలయం, వనవాసీ కళ్యాణ పరిషత్ ఆధ్వర్యంలో వివిధ గ్రామాల్లో సీతారాముల కల్యాణం సందర్భంగా రాములు, సీతా లక్ష్మణులు, ఆంజనేయుల విగ్రహాలను శుక్రవారం అందజేశారు. గ్రామాల్లో వైభవంగా సీతారాముల కల్యాణం జరగడానికి కృషి చేయాలని విద్యార్థి నిలయం అధ్యక్షుడు కొడిప్యాక విద్యాసాగర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో తిరుపతి, విజయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

బృహత్ పల్లె ప్రకృతి వనంలో చెట్ల నరికివేత


ప్రకృతి వనంలో నరికిన చెట్లు

హాజీపూర్, ఏప్రిల్ 12: కర్ణమామిడి పంచాయతీ పరిధిలోని కొండపల్లి శివారులోని బృహత్ పల్లె ప్రకృతి వనంలోని చెట్లను శుక్రవారం నరికివేశారు. 2021లో ఎల్లంపల్లి ప్రాజెక్టు ముంపులో పోయిన 10 ఎకరాల భూమిలో బృహత్ పల్లె ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేసి 30 వేల మొక్కలను నాటారు. ప్రస్తుతం వనంలోని చెట్లు ఏపుగా పెరిగాయి. గడ్డం మల్లారెడ్డి, గడ్డం రాజేశ్వర్‌రెడ్డిలు చెట్లను శుక్రవారం నరకడం మొదలుపెట్టారు. విషయం తెలుసుకున్న ఈజీఎస్ ఏపీవో మల్లయ్య అడ్డుకున్నారు. ఏపీవోకు మల్లారెడ్డి, అతని కొడుకు మధుసూదన్‌ల మధ్య వాగ్వాదం జరిగింది. వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మాజీ సర్పంచు కొట్టె మహేందర్, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచు భర్త గడ్డం ముకుంద రెడ్డిలు తమ భూమిలో మొక్కలు నాటారని పేర్కొన్నారు. ఇప్పుడు మేం అధికారంలో ఉన్నాం అందుకే చెట్లు నరుకుతున్నామని పేర్కొన్నారు. చెట్లను నరకడం ఆపకపోతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి చర్యలు తీసుకుంటామని ఏపీవో హెచ్చరించడంతో వెళ్లిపోయారు. కార్యదర్శి వెంకటస్వామి, కారోబార్ శ్రీనివాస్, జ్యోతి పాల్గొన్నారు.

సెల్ ఫోన్లు అందజేత

కాగజ్‌నగర్ ఏప్రిల్ 12: నామనగర్ ప్రాంతంలో వేర్వేరు చోట్ల పోగొట్టుకున్న రెండు సెల్‌ఫోన్లను శుక్రవారం రూరల్ ఎస్సై రామన్‌కుమార్ సంబంధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సెల్‌ఫోన్ల విషయంలో అంతా జాగ్రత్తగా ఉండాలన్నారు.

జిల్లాలో 35.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

ఆసిఫాబాద్, ఏప్రిల్ 12: జిల్లాలో శుక్రవారం 35.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పెంచికల్‌పేట మండ లంలో 35.6డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, దహెగాంలో 35.3, కాగజ్‌నగర్‌లో 34.6, కౌటాలలో 34.2, రెబ్బెనలో 33.8, ఆసిఫాబాద్‌లో 33.7, బెజ్జూర్‌లో 33.7, చింతలమానేపల్లిలో 33.2, కెరమెరిలో 33.1డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కాగజ్‌నగర్ టౌన్, ఏప్రిల్ 12: కాగజ్‌నగర్ పట్టణంలోని సబ్‌స్టేషన్‌లోని ఉదయం 9నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్ తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేస్తున్నట్టు తెలిపారు. పట్టణవాసులు సహకరించాలని కోరారు.

వర్షాకాలంలోపు వంతెనను పూర్తి చేయాలి

సిర్పూర్(యు), ఏప్రిల్ 12: మండలంలోని రాఘపూర్ సమీపంలో నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమ్ర శంకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 60సంవత్సరాల క్రితం నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరడంతో ప్రభుత్వం నూతన వంతెననిర్మాణానికి నిధులు మంజూరు చేసిందన్నారు. వంతెన పిల్లర్ల కోసం గుంతలు తవ్వి నెలలు గడిచిపోతున్నా పనులు ప్రారంభించడం లేదన్నారు. వెంటనే వంతెన నిర్మాణం ప్రారంభించి వర్షాకాలంలోపు పూర్తిచేయాలన్నారు. ఉన్నతఅధికారులు స్పందించి వంతెన నిర్మాణం పనులు సకాలంలో పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

అంబేద్కర్ జయంతిని విజయవంతం చేయాలి

వాంకిడి, ఏప్రిల్ 12: అంబేద్కర్ జయంతి వేడుకలను విజయవంతం చేయాలని బీఎస్ఐ జిల్లా అధ్యక్షుడు మహల్కార్ అశోక్, జయరాం ఉప్రె కోరారు. ఈ నెల 14న నిర్వహించనున్న అంబేద్కర్ జయంతి కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

రెబ్బెన, ఏప్రిల్ 12: రెబ్బెన మండలం ఇందిరానగర్‌లో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందినట్టు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఇందిరానగర్ గ్రామానికి చెందిన చిన్నయ్య (40) రోడ్డు దాటుతుండగా కారు(టీఎస్01ఇఇ6393) ఢీకొంది. దీంతో చిన్నయ్యకు తీవ్రగాయాలు కాగా, చికిత్స కోసం బెల్లంపల్లి ఆసుపత్రికి తరలించారు. అక్కడపరీక్షలు నిర్వహించిన వైద్యులు చిన్నయ్య మృతి చెందినట్టు తెలి పారు. చిన్నయ్య భార్య లలిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

సింగరేణిలో క్రీడాభివృద్ధికి పెద్దపీట

● మందమర్రి జీఎం మనోహర్

మందమర్రిటౌన్, ఏప్రిల్ 12: సింగరేణి యాజమాన్యం క్రీడాభివృద్ధికి పెద్దపీట వేస్తుందని మందమర్రి ఏరియా జీఎం మనోహర్ తెలిపారు. శుక్రవారం రాత్రి సీఈఆర్ క్లబ్‌లో నిర్వహించిన మందమర్రి ఏరియా డబ్ల్యూపీఎస్ అండ్‌జీఏ 59వ కార్మిక క్రీడావార్షికోత్సవాలకు ఆయన హాజరై మాట్లాడారు. ప్రస్తుతం సింగరేణిలో కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగాల్లో చేరిన చాలామంది క్రీడల్లో రాణిస్తున్నారన్నారు. సింగరేణి క్రీడాకారులు కోల్ ఇండియాలో సత్తా చాటి బహుమతులు సాధించాలన్నారు. క్రీడాకారులను యాజమాన్యం ప్రోత్సహిస్తుందన్నారు. ఎంచుకున్న క్రీడల్లో రోజు సాధన చేస్తే మంచి నైపుణ్యం కనబరుస్తారని తెలిపారు. అనంతరం ఆయా క్రీడల్లో సత్తా చాటిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి, పీఎం శ్యాంసుందర్, అధికారుల సంఘం అధ్యక్షుడు రమేష్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, క్రీడల కార్యదర్శి మాస్కుల కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో కీలకపోస్టులు ఖాళీ

● ఎక్కడి పనులు అక్కడే.. ● అదనపు బాధ్యతలతో అధికారుల అవస్థలు ● అనుమతుల కోసం ఇబ్బందులు పడుతున్న ప్రజలు



మున్సిపల్ కార్యాలయం

కాగజ్‌నగర్ ఏప్రిల్ 12: కాగజ్‌నగర్ మున్సిపాల్టీలో కీలక పోస్టులు భర్తీ కావటం లేదు. దీంతో ఉన్న ఉద్యోగులపైనే అదనపు భారం పడుతోంది. మున్సిపాల్టీలో ఇంజనీరింగ్ విభాగం, ఎకౌంట్స్ విభాగం, టౌన్ ప్లానింగ్ విభాగం ఎంతో కీలకం. ఈ మూడువిభాగాల్లో ఉండే కీలకపోస్టులన్నీ ఖాళీగా ఉండటంతో ఎక్కడి పనులు అక్కడే పేరుకుపోతున్నాయి. టౌన్ ప్లానింగ్ విభాగంలో టౌన్‌ప్లానింగ్ అధికారి-1, టీపీఎస్-2, టౌన్‌ప్లానింగ్ అండ్ బిల్డింగ్ ఓవర్‌సీర్(టీపీబీఓ)-4 పోస్టులు ఉన్నాయి. ఇంజనీరింగ్ విభాగంలో డీఈ రమాదేవి విధులు నిర్వహిస్తున్నారు. ఈ శాఖలో ఇద్దరు ఏఈలు ఉండాల్సి ఉండగా, ఇందులో ఏఈ సతీష్ పెద్దపల్లి మున్సిపాల్టీకి డిప్యూటేషన్‌పై వెళ్లారు. మరోపోస్టు ఖాళీగా ఉంది. అకౌంట్స్ విభాగంలో సీనియర్ అకౌంట్ ఆఫీసర్స్-2, సీనియర్ అసిస్టెంట్లు-3, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్స్-3 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

టౌన్‌ప్లానింగ్ విభాగంలో పేరుకుపోతున్న సమస్యలు..

మున్సిపాల్టీలో టౌన్‌ప్లానింగ్ అధికారిగా యశ్వంత్ కొనసాగుతున్నారు. జిల్లాలోని నాలుగు మున్సిపాల్టీలకు ఈయనే ఇన్‌చార్జీగా టీపీవోగా వ్యవహరిస్తున్నారు. మిగితా టీపీవో పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇంతవరకూ ఈ పోస్టులను భర్తీ చేయటం లేదు. భవన నిర్మాణాల అనుమతులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే టౌన్ ప్లానింగ్ శాఖ అధికారులు విచారణ చేసి అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. ఇటువంటి సందర్భాలో సిబ్బంది కొరత కారణంగా పనులు త్వరగా కావడం లేదు. దీంతో దరఖాస్తుదారులు ఇబ్బందులు పడుతున్నారు. అంతేగాక పట్టణంలో అక్రమార్కులు ప్రభుత్వ స్థలాలను కబ్జా చేయడం, అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టడం చేస్తుంటారు. అటువంటి సందర్భాల్లో వాటిని అడ్డుకునే వారు లేక అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి.

ఇంజనీరింగ్ విభాగంలో..

ఇంజనీరింగ్ విభాగం అధికారులు వార్డుల్లో రోడ్ల ప్రతిపాదనలు, మురికి కాల్వనిర్మాణం, తదితర వాటిని చూడాల్సి ఉంటుంది. ఈ శాఖలో కేవలం డీఈ రమాదేవి ఒక్కరే బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. మున్సిపాల్టీలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఏటా నిధులను కేటాయిస్తాయి. ఈ నిధుల ద్వారా నూతన రోడ్లు, మురికి కాల్వలు, మూత్రశాలలు తదితర అభివృద్ధి పనులను చూసుకోవాలి. కానీ ఈ శాఖలో ఇద్దరు ఏఈలు ఉండాల్సి ఉండగా, ఇందులో ఏఈ సతీష్ పెద్దపల్లి మున్సి పాల్టీకి డిప్యూటేషన్‌పై వెళ్లారు. మరోపోస్టు ఖాళీగా ఉంది. ఇంతవరకు భర్తీ కాలేదు. కేవలం డీఈ రమాదేవి మాత్రమే పనులను పర్యవేక్షిస్తున్నారు.

స్వచ్ఛంద సంస్థల వినతులు..

అధికారుల కొరతతో ఇబ్బందులు పడుతున్నట్లు పలు స్వచ్ఛంద సంస్థల సభ్యులు పలుమార్లు ఉన్నతాధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. అయినప్పటికీ ఇంతవరకు ఎలాంటి పురోగతి లేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేస్తుందో లేదో చూడాలి.

● ఉన్నతాధికారులకు నివేదికలు పంపించాం..

- అంజయ్య, కమిషనర్



కాగజ్‌నగర్ మున్సిపాల్టీలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని ఉన్నతాధికారులకు నివేదికలను పంపించాం. ఆయాశాఖల్లో కీలకంగా ఉండే పదిపోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలియజేశాం.

దుకాణ సముదాయ భవనం సీజ్


దుకాణాలను సీజ్ చేస్తున్న కార్యదర్శి తుకారాం

బెజ్జూరు, ఏప్రిల్ 12: మండలంలోని గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్మించిన దుకాణ సముదాయ భవనాన్ని శుక్ర వారం కార్యదర్శి తుకారాం సీజ్ చేశారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో దుకాణ సముదాయాల నిర్మాణాన్ని చేపట్టగా నిర్మాణాలపై కోర్టులో కేసు నడుస్తుండగా బెజ్జూరుకు చెందినవ్యక్తి భవనంలో దుకాణం ఏర్పాటుకోసం భవనానికి షెటర్లుఏర్పాటుచేశాడు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు భవనానికి సీల్ వేసినట్లు కార్యదర్శి పేర్కొన్నారు.

బీజేపీలో చేరిన బీఆర్ఎస్ నాయకులు


బీజేపీలోకి చేరిన వారికి కండువాలను కప్పుతున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు

కాగజ్‌నగర్ ఏప్రిల్ 12: చెడ్వాయికి చెందిన బీఆర్ఎస్ నాయకులు చౌదరి సత్తయ్య, చింతపుడి సత్తయ్యతో పాటు పలువురు కార్యకర్తలు శుక్రవారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ హరీష్‌బాబు మాట్లాడుతూ బీజేపీని ఆదరించాలన్నారు. రానున్న ఎంపీ ఎన్నికల్లో బీజేపీకి ఓటేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, పోశన్న, బాబాజీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పల్లకీ శోభాయాత్ర


శోభాయాత్ర నిర్వహిస్తున్న యువకులు

చింతలమానేపల్లి, ఏప్రిల్ 12: మండలంలోని ఖర్జవెల్లి, చింతలమానేపల్లి, బాబాసాగర్ గ్రామాల్లో శుక్రవారం రథ పంచక్రోసి పల్లకీ శోభాయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు మంగళహారతులతో రాగా ఆయా గ్రామాల్లోని వీధులగుండా భక్తులు శోభాయాత్ర నిర్వహించారు. కార్తీక్‌స్వామి ప్రశాంత్ మందిర్, ప్రశాంత నిలయం పుష్కరఘాట్ తుమ్మిడిహెట్టి నుంచి ప్రారంభమైన యాత్ర ఈనెల17వరకు కొనసాగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం ఆయాగ్రామాల్లోని ఆలయాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఈద్గా కమిటీ

సిర్పూర్(టి), ఏప్రిల్ 12: మండల కేంద్రంలోని జామ మజీద్‌లో అధ్యక్షుడు రఫీఅహ్మద్ ఆధ్వర్యంలో ఖదీమ్ ఈద్గాకమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మోయిజ్ అహ్మద్, వైస్‌ప్రెసిడెంట్‌గా పహాద్ అహ్మద్, సెక్రె టరీగా రిజ్వాన్‌ఉల్లాఖాన్, కోశాధికారిగా ముఖీద్, అస్లంబీన్ అబ్దుల్లాహ్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా వారు ఈద్గా అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

ఆర్టీసీ ఎన్‌క్వైరీ నంబర్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్, ఏప్రిల్ 12: ప్రయాణికులు ఆర్టీసీ ఎన్‌క్వైరీ ఫోన్ నెంబర్‌ను సద్వినియోగం చేసుకోవాలని డీఎం విశ్వనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికుల బస్‌లసమాచారం కొరకు 7382840731 నంబర్‌కు ఫోన్‌చేసి తెలుసుకోవచ్చన్నారు.

ఘనంగా జ్యోతిబాపూలే జయంతి

కెరమెరి, ఏప్రిల్ 12: కెరమెరి మండలం మోడి గ్రామంలో శుక్రవారం జ్యోతిబాపూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



అభయహస్తం డబ్బులు ఇచ్చేనా?



- ఉమ్మడిరాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నగదు జమ
- ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత పథకం రద్దు
- జమ చేసిన నగదు చెల్లించాలంటున్న మహిళలు
- కొత్త సర్కారుపైనే ఆశలు

అభయహస్తం

పెంచికలపేట, ఏప్రిల్ 12: స్వయం సహాయక సంఘాల్లో సభ్యత్వం ఉన్న మహిళలకు వృద్ధాప్యంలో చేయూత అందించేలా గతంలో ఉమ్మడి రాష్ట్రంలోని ఆనాటి కాంగ్రెస్‌ప్రభుత్వం అభయహస్తం పథకాన్ని ప్రారంభించింది. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల కోసం మహిళలు ఈ పథకానికి డబ్బులు కూడా చెల్లించారు. తద్వారా మహిళా సభ్యుల పిల్లలకు ఉపకార వేతనాలు, వృద్ధాప్యంలో పింఛన్‌తోపాటు ప్రమాదవశాత్తు మరణిస్తే బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. తక్షణ సహాయం కింద అంత్యక్రియలకు రూ.5వేలు ఇచ్చేవారు. అయితే ప్రత్యేకరాష్ట్రం ఏర్పడడం, తెలంగాణలో కొత్త ప్రభుత్వపాలన ప్రారంభమైన తర్వాత అభయహస్తం పథకాన్ని నిలిపివేసింది. దీంతో అప్పటి వరకు అభయహస్తం కింద డబ్బులు చెల్లించిన మహిళలు తమ నగదు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వచ్చారు. 2022మార్చిలో అభయహస్తం నగదు చెల్లించిన మహిళలను గుర్తించి వారికి తిరిగి చెల్లించాలని నిర్ణయం తీసుకుంది. కానీ ఇంతవరకు చెల్లించలేదు.

పథకం ప్రారంభమైందిలా..

అభయహస్తం పథకాన్ని 2009లో ప్రారంభించగా స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉండి 18నుంచి 60ఏళ్ల లోపు మహిళలను అర్హులుగా గుర్తించారు. పొదుపుసంఘాల్లోని మహిళా సభ్యులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ఈ పథకాన్ని అమల్లోకి తీసుకువచ్చారు. మహిళా సభ్యులు ఏటా రూ.365చెల్లించాల్సి ఉంటుంది. ప్రభుత్వం రూ.360 జమ చేస్తూ ఉండేది. ఇలా జమ చేసిన డబ్బులతో 60ఏళ్లు నిండి తరువాత అభయహస్తం పథకం పెన్షన్ కింద ప్రతినెల రూ.500చొప్పున చెల్లించేవారు. అయిదేళ్ల పాటు వృద్ధులకు రూ.500 చొప్పున పెన్షన్ చెల్లించారు. ఆ తరువాత ప్రత్యేక రాష్ట్రం ఏర్పడడం, ప్రభుత్వం మారడంతో రాష్ట్రంలో ఆసరా పెన్షన్ అమలు చేయడం వృద్ధాప్య పింఛన్ కింద రూ.2016కు పెంచడంతో ఈ పథకం మూలన పడింది.

36,078 మంది సభ్యులకు లబ్ధి..

అభయహస్తం పథకానికి తాము చెల్లించిన నగదును తిరిగి ఇవ్వాలని చాలా కాలం నుంచి స్వయం సహాయక సంఘాల మహళలు కోరుతున్నారు. అయితే ఈ పథకం కింద కట్టిన డబ్బులకు వడ్డీతో కలసి ఇవ్వాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లా వ్యాప్తంగా 36,078 మంది అభయహస్తం పథకం కింద రూ.9,17,92,000నగదు చెల్లించారు. సంబంధితశాఖ అధికారులు లబ్ధిదారులను గుర్తించి సభ్యుల వివరాలు వారి బ్యాంకు ఖాతా వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు తెలిపారు.

కొత్త ప్రభుత్వంపైనే ఆశలు..

అభయహస్తం పథకం ఉమ్మడిరాష్ట్రంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తరువాత మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అభయహస్తం డబ్బులు తిరిగి చెల్లిస్తారని లబ్ధిదారులు ఆశతో ఎదురు చూస్తున్నారు.

డబ్బులు చెల్లించాలి..

బోట్లకుంట ఎల్లమ్మ, దహెగాం



అభయహస్తం కింద పదేళ్ల క్రితం నగదు చెల్లించాం. ఇప్పటివరకు డబ్బులు తిరిగి చెల్లిస్తామని కాలయాపన చేస్తున్నారే తప్ప ఇవ్వలేదు. ఇప్పటికైనా మా డబ్బులు తిరిగి చెల్లించాలి.

కొత్త ప్రభుత్వం డబ్బులు చెల్లించాలి..

చౌదరి బాయమ్మ, పెంచికలపేట



2009లో పథకం కింద నగదును చెల్లించాం. తెలంగాణ వచ్చిన తరువాత ప్రభుత్వం ఈ పథకాన్ని నిలిపివేసింది. దీంతో మేము చెల్లించిన డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరుతూనే ఉన్నాం. ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నాం. కొత్త ప్రభుత్వం అయినా మా డబ్బులు తిరిగి చెల్లించాలి.

మారుమూల గ్రామాలకు సైతం నిరంతరం తాగునీరు

- అదనపు కలెక్టర్ దీపక్‌తివారి

ఆసిఫాబాద్, ఏప్రిల్ 12: జిల్లాలోని మారుమూల గ్రామాలకు సైతం నిరంతరం తాగునీటి సరఫరాకు అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈక్రమంలో దినపత్రికల్లో వచ్చిన వార్త కథనాలపై తక్షణమే స్పందిస్తూ పరిష్కారం దిశగా కృషి చేస్తామన్నారు. జిల్లాలో జైనూరు మండలం జంగాం గ్రామపంచాయతీలో 614ఆవాసాలు, 2,398జనాభా ఉండగా గ్రామ పంచాయతీ పరిధిలోని నడక్‌గూడ గ్రామంలో 113ఆవాసాలు, 576మంది జనాభా ఉన్నారని తెలిపారు. జంగాంలో నీటి అవసరాలు తీర్చేందుకు పది చేతిపంపులు, ఏడు మోటార్లతో బోర్‌వెల్స్, 4మోటార్లతో కూడిన బహిరంగ బావులు, ఒకమోటారు లేని బహిరంగ బావి, మిషన్‌భగీరథ పథకంలో 40 కేఎల్‌వోహెచ్‌ఎస్‌ఆర్-3, 20కేఎల్, 40 కేఎల్-1, 20 కేఎల్‌జీఎల్‌ఆర్ ఆర్‌వో ప్లాంటు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ క్రమంలో సంబంధిత అధికారుల సమన్వయంతో ఇంటింటికి తిరుగుతూ తాగునీటి సరఫరా సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

బోరుబావులకు మరమ్మతులు

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

జైనూరు, ఏప్రిల్ 12: 'జంగాంలో తాగునీటి కటకట' అనే శీర్షికన శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ప్రచురితమైన వార్త కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు ఎంపీడీవో ప్రభుదాస్, ఏఈ ఖలీల్, పంచాయతీ కార్యదర్శి మధుకర్ జంగాం, నడక్‌గూడ గ్రామాలను సందర్శించి తాగునీటి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని బోరుబావులకు వెంటనే మరమ్మత్తులు చేపట్టారు. ఆయా గ్రామాల ప్రజలకు మంచినీటి సదుపాయం కల్పించారు.



గ్రామంలో సరఫరా అవుతున్న నీటిని పట్టుకుంటున్న మహిళ

భక్తి భావంతోనే మానసికోల్లాసం

- రామ్‌సింగ్ మహరాజ్



ఆధ్యాత్మిక ప్రవచనాలు చెపుతున్న మహరాజ్

లింగాపూర్, ఏప్రిల్ 12: భక్తిభావంతోనే మానసికోల్లాసం కలుగుతుందని రామ్‌సింగ్ మహరాజ్ అన్నారు. లింగాపూర్‌మండలంలోని మాడిపల్లి వంజారిగూడ గ్రామంలో 7రోజులుగా కొనసాగుతున్న అఖండ హరినామ సప్తాహ కార్యక్రమంలో ఆయన భక్తులనుఉద్దేశించి మాట్లాడారు. సప్తాహలో పాల్గొంటే మానసికోల్లాసంతో పాటు భక్తిభావం పెరుగుతుందన్నారు. ఏడురోజుల పాటు జరిగిన అఖండ హరినామ సప్తాహ శుక్రవారం ముగిసింది. కార్యక్రమంలో గ్రామస్థులు విశ్వంబర్, బివాజి, నాతారావు, గోవింద్, ఉమాకాంత్, పాండురంగ్, మారుతి, విజయ్, ఏకనాథ్, ఆదినాథ్, గంగా, గ్రామస్తులు పాల్గొన్నారు.

లింగాపూర్‌లో హనుమాన్, సేవాలాల్ దీక్షలు

లింగాపూర్ ఏప్రిల్ 12: మండలకేంద్రంతో పాటు గ్రామాల్లో సంత్‌సేవాలాల్ మహరాజ్ దీక్షలతోపాటు హనుమాన్ దీక్షలు తీసుకుంటున్నారు. దీంతో మండలం అంతా భక్తిభావంతో పండుగ వాతావరణంలా ఉంది. ఏ గ్రామంలో చూసినా దీక్షా పరులే కనిపిస్తున్నారు. దీక్షలతో మానసికోల్లాసం దైవ చింతన పెంపొందుతాయని భక్తులు పేర్కొంటున్నారు.



సేవాలల్ దీక్షలు తీసుకున్న భక్తులు

ప్యాసింజర్ రైళ్లే దిక్కు

- ఆసిఫాబాద్ రోడ్ రైల్వేస్టేషన్‌లో కలగానే ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్
- దూరప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు తప్పని అవస్థలు
- ఆదాయం ఉన్నా వసతులు కల్పించని అధికారులు



ఆసిఫాబాద్ రోడ్ రైల్వే స్టేషన్

రెబ్బెన, ఏప్రిల్ 12: ఆసిఫాబాద్ నియోజకవర్గంలో ఏకైక ఆసిఫాబాద్‌రోడ్ రైల్వేస్టేషన్‌పై పాలకుల నిర్లక్ష్యంతో ఏటా ప్రయాణికులకు ఇబ్బందులు తప్పటం లేదు. ఈ రైల్వేస్టేషన్‌లో ఏళ్లు గడుస్తున్నా కూడా ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్ కావటం లేదు. ఏటా నిరీక్షిస్తున్నా ఇంతవరకు ఆచరణలోకి రావటం లేదు. ఈ సమస్యను పరిష్కరించాలని పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ కూడా బుట్టదాఖలవుతున్నాయే తప్పా ఎలాంటి ప్రయోజనం చేకూరటం లేదు. రెబ్బెన మండల కేంద్రం లోని ఆసిఫాబాద్‌రోడ్ రైల్వే స్టేషన్‌కు ఘనమైన చరిత్ర ఉంది. ఈస్టేషన్ నిజాం కాలంలో ఏర్పాటైంది. కానీ నేటికి పూర్తిస్థాయి వసతులు కల్పించటం లేదు.

ఒకప్పుడు జిల్లా కేంద్రంగా ఉన్న ఆసిఫాబాద్‌తోపాటు బొగ్గు గనుల ఏర్పాటు పారిశ్రామిక ప్రాంతంగా మారిన గోలేటి, వాంకిడి, కెరమెరి మండలాలకు ఈ స్టేషన్ పెద్ద దిక్కు ఉంది. అయినా కూడా పాలకుల దీని అభివృద్ధి, ప్రయాణీకుల సౌకర్యాలు కల్పించటంలో నిర్లక్ష్యం చూపుతున్నారు. 2017 రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల పునర్విభజన చేపట్టడంతో ఆసిఫాబాద్ జిల్లాగా ఏర్పడింది. దీంతో ఆసిఫాబాద్ నియోకవర్గానికి పెద్ద దిక్కుగా ఉన్న రైల్వేస్టేషన్ అభివృద్ధిపై ప్రయాణీకులు కొండంత ఆశలు పెట్టుకున్నారు. జిల్లాలో మూడు రైల్వేస్టేషన్లు ఉండగా ఆసిఫాబాద్ నియోకవర్గంలో ఇది ఒక్కటే ఉంది. ఈ స్టేషన్‌లో అభివృద్ధి జరిగిందంటే కేవలం ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం మాత్రమే. ప్రజలంతా ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్ కోసం నిరీక్షిస్తున్నారు.

ఇక్కడి నుంచి ప్రయాణీకులు హైదరాబాద్, వరంగల్, కొత్తగూడెం, ఖమ్మం, విజయవాడతోపాటు మహరాష్ట్రలోని చంద్రాపూర్, నాగ్‌పూర్ ప్రాంతాలకు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. ఎక్స్‌ప్రెస్ హాల్టింగ్ లేకపోవటంతో ప్యాసింజర్ రైళ్లలో వెళ్లాల్సి వస్తోందని పలువురు ప్రయాణీకులు తెలిపారు. దూర ప్రాంతాలకు వెళ్లాలంటే ఇటు కాగజ్‌నగర్, అటు బెల్లంపల్లికి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. భాగ్యనగర్, ఇంటర్‌ఎక్స్‌ప్రెస్‌లు అందుబాటులో ఉన్నాయి. మిగితా ఎక్స్‌ప్రెస్ రైళ్లకు కూడా హాల్టింగ్ ఇస్తే చంద్రాపూర్, బల్లార్షా, ఇటార్సి, వారణాసి, ఢిల్లీ ప్రాంతాలకు పోయేందుకు వీలు ఉంది. అయినా కూడా సూపర్ ఫాస్ట్ రైళ్లను ఆపకపోవటంతో అంతా ఇబ్బందులు పడుతున్నారు. ఆసిఫాబాద్ రైల్వే స్టేషన్‌లో భారీగానే ఆదాయం సమకూరుతున్నా కూడా సౌకర్యాలు కల్పించకపోవటంతో ప్రయాణీకులు అధికారుల తీరుపై మండిపడుతున్నారు. సింగరేణి బొగ్గు రవాణా ద్వారా నెలకు రూ.కోటి వరకు ఆదాయం సమకూరుతున్న కూడా వసతులు కల్పించకపోవటం దారుణమని పలువురు పేర్కొన్నారు. స్టేషన్‌లో వెయింటింగ్‌హాల్, షెడ్లు లేకపోవటంతో ప్రయాణీకులు గంటల తరబడి నిల్చునే రైళ్ల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.



ఆసిఫాబాద్ రోడ్ రైల్వే స్టేషన్ బోర్డు

ఎలాంటి అభివృద్ధి లేదు..

- ఎం.శ్రీనివాస్ గౌడ్, రెబ్బెన



ఆసిఫాబాద్ రోడ్ రైల్వే స్టేషన్‌లో ఎలాంటి అభివృద్ధి జరగలేదు. నిజాం కాలంలో ఏర్పాటుచేసి స్టేషన్ పూర్తి స్థాయి సౌకర్యాలు కల్పించటం లేదు. బెంచాలు, షెడ్లు లేక ప్రయాణీకులు ఇబ్బంది పడుతున్నారు. ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్ కోసం వినతిపత్రాలిచ్చిన కూడా సమస్య పరిష్కారం కాలేదు.

ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్ ఇవ్వాలి..

- డి.సంతోష్, నంబాల



ఆసిఫాబాద్ రోడ్ రైల్వేస్టేషన్‌కు ఘనమైన చరిత్ర ఉంది. ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్ ఇస్తే ఆసిఫాబాద్, వాంకిడి, కెరమెరి, రెబ్బెన మండలాల వాసులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. సూదర ప్రాంతాలకు వెళ్లేందుకు చక్కటి అవకాశం ఉంటుంది. ప్రస్తుతం కాగజ్‌నగర్, బెల్లంపల్లి రైల్వేస్టేషన్లకు వెళ్లి ఎక్కాల్సిన పరిస్థితి ఏర్పడింది. అధికారులు వెంటనే స్పందించాలి.

ఆదాయం ఉన్నా కూడా..

- నాజీర్ ఉస్మాన్, రెబ్బెన



ఆసిఫాబాద్ రోడ్ రైల్వే స్టేషన్ నుంచి ఆదాయం ఉన్నా కూడా వసతులు కల్పించటంలో అధికారులు చిన్న చూపు చూస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి ఎక్స్‌ప్రెస్ రైళ్లు, సూపర్‌ఫాస్ట్ రైళ్లు ఇక్కడ నిలుపుదల చేయాలి. దీంతో మరింత ఆదాయం పెరుగుతుంది. అలాగే వసతులు కూడా కల్పించాలి. చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

హత్య కేసులో ఇద్దరికి జీవితఖైదు

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 12: భర్తను హత్య చేసిన కేసులో భార్యతోపాటు ఇద్దరికి జీవితఖైదు విధిస్తూ జిల్లా సేషన్‌కోర్టు ప్రధానన్యాయమూర్తి ఎంవీ రమేష్ శుక్రవారం తీర్పు చెప్పారు. కౌటాల సీఐ సాదిక్‌పాషా తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్‌రాష్ట్రానికి చెందిన కొంత మంది కూలీలు సిర్పూర్ ఫారెస్ట్ రేంజ్‌లో ఇటిక్యాలపహాడ్ ఫారెస్టు బీట్‌నందు ప్లాంటేషన్ పనినిమిత్తం ఇక్కడకు వచ్చారు. ఆ కూలీల్లో మడావి దేవేందర్, పార్వతి భార్యాభర్తలు. కాగా మడావి పార్వతికి మడావి రాంలాల్ అనే వ్యక్తితో వివాహేతర సంబంధం నేపథ్యంలో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఒకరోజు మడావి దేవేందర్ పనికి రాకపోవడంతో ఇటిక్యాల పహాడ్ బీట్ అధికారి నరేష్ వారి గుడిసెలకు వెళ్లి అతని భార్య మడావి పార్వతిని విచారించాడు. నాభర్త ఎక్కడికి వెళ్లాడో నాకు తెలియదు అని సమాధానం ఇచ్చింది. పక్కన ఉన్నవారిని కూడ విచారించగా వారు తమకు తెలియదు అని సమాధానం ఇచ్చారు. ఈ మేరకు బీట్ అధికారి ఆగస్టు2,2022న సిర్పూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టగా మడావి పార్వతి, మడావి రాంలాల్ ఇద్దరూ కలిసి దేవేందర్‌ను హత్యచేసి మడావి రాము అనే మరో వ్యక్తి సహాయంతో మృతదేహాన్ని పూడ్చిపెట్టినట్లు ఒప్పుకున్నారు. అప్పటి సీఐ బుద్దెస్వామి, ఎస్సై రవికుమార్ నిందితులను అరెస్టుచేశారు.

ఈ మేరకు శుక్రవారం నిందితులపై నేరం రుజువు కావడంతో మడావి పార్వతి, మడావి రాంలాల్‌కు జీవితఖైదు విధిస్తూ తీర్పుచెప్పారు. మరో నిందితుడు మడావి రాము రిమాండ్ కాలాన్ని శిక్షగా మార్చినట్లు అయన తెలిపారు. ప్రాసిక్యూషన్ తరఫున జగన్‌మోహన్ వాదించారు. నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన కౌటాల సీఐ సాదిక్‌పాషా, సిర్పూర్(టి) ఎస్సై దీకొండ రమేష్, కోర్టు సిబ్బందిని ఎస్పీ సురేష్‌కుమార్ అభినందించారు.

ప్రారంభోత్సవానికి ముస్తాబవుతున్న అయ్యప్ప ఆలయం

- ఈ నెల 21న ప్రారంభం



అయ్యప్ప ఆలయం

సిర్పూర్(టి), ఏప్రిల్ 12: మండల కేంద్రంలోని కాగజ్‌నగర్-సిర్పూర్(టి) ప్రధానరహదారి పెద్దబండ వాగు ఒడ్డున నిర్మించిన అయ్యప్ప ఆలయం ప్రారంభోత్సవానికి ముస్తాబవుతోంది. ఈనెల21న ఆలయాన్ని ప్రారంభించడానికి ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన అంజలి, రవీందర్‌రావు దంపతులు ఆరుగుంటల భూమిని ఆలయానికి విరాళంగా అందజేయడంతో మండలకేంద్రానికి చెందిన అయ్యప్ప భక్తులు, అభిమానులు ఆలయ నిర్మాణం పనులను దాతల సహకారంతో పూర్తి చేశారు. ప్రారంభోత్సవం రోజున పలు ప్రాంతాలకు చెందిన స్వామీజీలు రానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా మహాపడిపూజతోపాటు అన్నదానం నిర్వహిస్తామని తెలిపారు.

మహారాష్ట్ర సరిహద్దు పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన డీఎస్పీ



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ,సీఐ,ఎస్సైలు

కెరమెరి, ఏప్రిల్ 12: మండలంలోని మహారాష్ట్ర సరిహద్దులోగల గౌరి,బోలాపటార్, అంతాపూర్, ముక్తంగూడ, పరందోళి గ్రామాల్లోని పోలింగ్‌కేంద్రాల్లో ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్య, సీఐ శ్రీనివాస్,ఎస్సై విజయ్ శుక్రవారం పరిశీలించారు. పోలింగ్‌కేంద్రంలో ఏర్పాట్లతోపాటు భద్రతకు చేపట్టాల్సిన చర్యల గురించి పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రజలు సహకరించాలని అన్నారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

అట్టహాసంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



శ్రీ రామచంద్ర గోపాలకృష్ణ మఠాధిపతిని సన్మానిస్తున్న సభ్యులు

కాగజ్‌నగర్ ఏప్రిల్ 12: కాగజ్‌నగర్ అందవెల్లి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ అనిత ఆధ్వర్యంలో పూజలను నిర్వహించారు. అనంతరం ఆదిలాబాద్ శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠాధిపతి యోగానంద సరస్వతి భక్తులకు ఆధ్యాత్మికత అంశాలను వివరించారు. కమిటీసభ్యులు, బీజేపీ నాయకులు మఠాధిపతిని సన్మానించారు.

గురుకుల పాఠశాలలో నైట్ డ్యూటీని రద్దు చేయాలి

కాగజ్‌నగర్, ఏప్రిల్ 12: గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయులకు నైట్ డ్యూటీని వెంటనే రద్దు చేయాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షకార్యదర్శి ఏటుకురు శ్రీనివాసరావు, ఆడె ప్రకాష్ డిమాండు చేశారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయులకు గతంలో వారానికి రెండు రోజులు రాత్రి సమయంలో పర్యవేక్షణ బాధ్యతలు ఇచ్చే వారన్నారు. ప్రస్తుతం నాలుగు రోజుల చొప్పున నైట్ డ్యూటీ నిర్వహించాలని సాంఘిక సంక్షేమ గురుకుల కార్యదర్శి వెల్లడించటం దారుణమన్నారు. ఈ విధానంతో విద్యార్థులకు బోధనలో నష్టం జరుగుతుందన్నారు. ఉపాధ్యాయులకు రాత్రిపూట డ్యూటీలు వేయకుండా చూడాలన్నారు.



డైరెక్టర్‌ల దృష్టికి కార్మికుల సమస్యలు



మాట్లాడుతున్న సలేంద్ర సత్యనారాయణ

మందమర్రిటౌన్, ఏప్రిల్ 12: సింగరేణి కార్మికుల ఆరోగ్యానికి సంబంధించి తమ యూనియన్ డైరెక్టర్‌లతో మాట్లాడిందని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, సహాయకార్యదర్శి కంది శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం యూనియన్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ ఇటీవల జరిగిన ట్రస్టుబోర్డు సమావేశంలో రిటైర్‌మెంట్ రోజున సీపీఆర్ఎంఎస్ కార్డు ఇవ్వాలని తమ యూనియన్ అగ్రనాయకులు కోరగా యాజమాన్యం అంగీకరించిందన్నారు. క్యాన్సర్, కిడ్నీ, తదితర జబ్బుల విషయంలో గతంలో కేటాయించిన రూ.8లక్షలు సరిపోవడం లేదని, దీన్ని పెంచాలని, దీన్ని ట్రస్టే భరించాలని కోరగా దీనికి కూడా అంగీకరించారని తెలిపారు. 5వేలమంది రిటైర్డు కార్మికులకు లైఫ్ సర్టిఫికెట్లు జతపర్చలేదని, వారిపేర్లు ఏరియాల వారీగా తెలియజేస్తామన్నారు. పెండింగ్‌లో ఉన్న సీఎంపీఎఫ్ రుణాల గురించి ప్రశ్నించగా అధికారులు కోల్ ఇండియాకు వెళ్లారని వారు వచ్చిన వెంటనే నిర్ణయం తీసుకుంటామని తెలిపారని పేర్కొన్నారు. తమఅధ్యక్షుడు సీతారామయ్య, ప్రధానకార్యదర్శి రాజ్‌కుమార్ పాల్గొని సమావేశంలో మాట్లాడారని వారు పేర్కొన్నారు. నాయకులు సంపత్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.